

# ప్రేమించిన దోషం

వై.యస్.లత

"ఉమా!"

జడ అల్లుకుంటున్న ఉమ వెనక్కి తిరక్కుండానే 'ఏం బావా?' అంది.

'నేను చెప్పిన సంగతి ఏంచేశావు ఉమా?'

'ఏముంది చెయ్యడానికి? నేను చెప్పవలసినదేదో చెప్పేనుగా'

'సావధానంగా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పమన్నాను కదు ఉమా'

'నేను మాట్లాడే భాష నీకు అర్థమౌతుందనే అనుకున్నాను. అనుకుంటున్నాను'

కాస్త కరుకుగానే అంది ఉమ.

"అలా తొందరపడకు ఉమా-ఇది జీవితసమస్య విదానంగా ఆలోచించమనే నిన్ను నేనుఅడిగింది."

బ్రతిమాలేడు శంకర్ మళ్ళీ.

'ఇది జీవిత సమస్య కాబట్టే నేనూ చెప్పేను. నువ్వంటే నా కలాంటి అభిప్రాయం ఏనాడూలేదు. రాదు. రాబోదుకూడా! ఎన్నిసార్లు చెప్పాలి నీకీ విషయం? నువ్వు మనిషివనే, ఒకసారి నీకుచెబితే అర్థం చేసుకుంటావనే అనుకున్నాను. కానీ... కానీ నన్నెందుకిలా వేధిస్తావు బావా? నిన్నలాంటి దృష్టితో చూడలేను మొర్రో అంటోంటే రోజుకోసార వచ్చి ఎందుకిలా నా ప్రాణాలు తీస్తావు? బావా! నీకిదే చివరిసారిగా చెపుతున్నాను. ఈ ప్రసక్తి మళ్ళీ నేను బ్రతికుండగా ఎప్పుడూ తీసుకురావద్దు. నా కంఠంలో ప్రాణముండగా నిన్ను పెళ్ళి చేసుకోవటం జరగదు. నువ్వన్నట్లుగా ఇది నూరేళ్ళపంటకాబట్టే నీకింతకాలం ఎంతో ఓర్పుగా చెప్పి చూశాను, కానీ నువ్వు నా సహనానికే పరీక్ష పెట్టి,నన్ను బలవంతాన లొంగదీసుకోవాలనుకుంటే ఈ జన్మకి కాదు కదా, వెయ్యి జన్మలెత్తినా అది నీకు సాధ్యపడదు బావా! ఇదే నా నిర్ణయం దీనికింక తిరుగులేదు. ఈ విషయం గురించి అడగడానికి నా దగ్గరకింకెప్పుడూ రావద్దు. వెళు, వెళ్ళిపో బావా!"

చేతిలోని జడని మెలికలు తిప్పుతూ ఏడుపు. కోపం, రోషం ముంచుకురాగా ప్రక్కనే ఉన్న మంచంమీద కూలబడింది ఉమ.

అప్పుడే ప్రక్కింటినుండి వచ్చిన సంధ్య తన గదిలోకి వెళ్ళబోతుండగా. చెల్లెలి మాటలు తారస్థాయిలో వినబడడంతో గుమ్మం అవతలే నిలబడి ఉమా శంకరాల సంభాషణ వినడం. శంకర్ గదిలోనుండి ఇవతలికి రాబోతుంటే ప్రక్క గదిలోకి తప్పుకోవడం కాకతాళీయంగా జరిగాయి.

తన గదిలోకి వెళ్ళి శంకర్ తీరుబడిగా కూర్చోలేక అటూ ఇటూ పచార్లు చేస్తూ కకావికలైన మనసును అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించ సాగేడు.

'ఛ! నేను తొందరపడ్డానేమో - వెంట వెంటనే అడిగి, వెంటపడి ఉమని వేధించేనేమో-ఇంకా వ్యవధి ఇచ్చివుంటే ఉమ నిర్ణయం మార్చుకునేదేమో ..అయినా తనకెందుకంత మొండితనం? నాకేం తక్కువని నన్ను తిరస్కరిస్తుంది? చదువు లేదా? అందంలేదా? డబ్బులేదా? నేనడగడం తను కాదనటం ఇది ఎన్నోసారి! ఇప్పటి కెన్నిసార్లిలా జరిగింది?' అనుకుంటూ ఉమని గురించిన ఆలోచనలలో మునిగిపోయేడు శంకర్.

• •

'ఉమా! ఈ పువ్వు లెంతబాగున్నాయో చూడు. నీకోసం ప్రత్యేకంగా తీసుకువచ్చేను' అంటూ

ఇచ్చి గులాబీలా ఉమముందు వేసేడు శంకర్.

'అబ్బబ్బ! నీకెన్నిసార్లు చెప్పాలి బావా. ఇలాంటి పనులు చెయ్యొద్దని. నువ్వు తెచ్చినదేదీ - నా కోసమని ప్రత్యేకించి తెచ్చినదేదీ - నా కసలు తీసుకోవాలనిపించదు. ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చెయ్యకు' అంటూ ఆ పువ్వులను విసురుగా ప్రక్కకి తోసేసి, విసుగ్గా అవతలి కెళ్ళిపోయింది ఉమ

ఇంకో రోజు—

చిత్రకళలో ఆరితేరిన శంకర్ చక్కటిపార్వతీ పరమేశ్వరుల బొమ్మవేసి చిత్రానికి క్రిందగా 'ఉమాశంకరులు' అని ముత్యాలలాంటి అక్షరాలతో వ్రాసి దానికి కొంచెం ప్రక్కగా 'ఉమకి' 'శంకర్' అని వ్రాసి ఎంతో ఆప్యాయంగా తీసి కెళ్ళి 'ఎలా ఉంది ఉమా! నీ కోసం వేసేను' అంటూ ఉమ చేతి కందించేడు.

క్షణకాలం ఆ చిత్రాన్ని రెప్ప వెయ్యకుండా చూసిన ఉమ దాన్ని పరపర చింపేసి - ఇలా వుంది - సరేనా?' అంటూ శంకర్‌వైపు చిర చిరలాడుతూ చూసింది.

మరో సారి—

'ఉమా, ప్లీజ్ - ఒక్కసారి రా ఉమా. ఒక్కటంటే ఒక్క ఫొటో తీస్తాను. పోనీ డ్రెస్ అప్పుడులే - అలాగే కుదురుగా నిలుచో - ఒక్క నిముషంలో తీసేస్తాను.'

కెమేరాను చేతిలో పట్టుకుని ఉమని ప్రాధేయ పడ్డాడు శంకర్.

'ఒక్కనిముషం ఉండు-అక్కనికూడా పిల్చుకు వస్తాను. అలా అయితేనే తీయించుకుంటాను' అంటూ సంధ్యని పిలవడానికి వెళ్ళింది ఉమ.

'ఎలాగో అలా ఒప్పుకుంది ఇద్దర్నీ నుంచో పెట్టి ఉమని మాత్రం తీసేస్తేలా... అని శంకర్ అనుకుంటోంటే ఉమా సంధ్యలు వచ్చేరు.

'బావా, మే మిద్దరం తీయించుకుంటాం గానీ తీసేముందు 'రెడీ అంటావుగా' అన్న ఉమ. శంకర్ రెడీ అని క్లిక్ నొక్కే సమయంలో రక్కున ప్రక్కకి తప్పుకుంది.

"ఏం పని ఉమా ఇది' అని సంధ్య కసిరేసరికి 'భలే అయింది బావ మోసపోయేడు' అని చప్పట్లు కొట్టుకుంటూ, నవ్వుకుంటూ టైమ్ చూసుకుని, 'అయ్యో - మూడయిపోతోంది అప్పుడే' అంటూ అక్కడి నుండి పారిపోయింది.

ఆ రాత్రి ఉమ శంకర్ గదికి వెళ్ళి. 'బావా! మధ్యాహ్నం నువ్వు ఫొటో తియ్యబోతే నే నెందుకలా చేసేనో నీకు తెలిసిందని అనుకుంటాను. తెలియకపోతే చెప్తున్నాను విను - నీ దగర నేను కాదుగదా, నా ఛాయ అయినా ఉండడం నా కిష్టం లేకనే అలా చేసేను. ఇప్పటి కయినా నా మనస్సు తెలుసుకో. ఇకముందెప్పుడూ యిలాంటి వెర్రి మొర్రి వేషాలు వేయకు" అంటూ చెప్పదల్చుకున్న నాలుగు మాటలూ చెప్పి వెనుదిరిగింది.

ఆ మాటలు వింటూ శంకర్ అవాక్కయి పోయేడు.

* * *

ఉమతో జరిగిన ఒక్కో సంఘటనా గుర్తుకు వస్తోంటే శంకర్‌కి ఒకవైపు బాధ, మరోవైపు ఉమంటే కోపం, కసి పెరగసాగాయి.

* * *

శంకర్ తన గదిలోకి వెళ్ళిపోగానే ఉమ దగ్గరికి వచ్చిన సంధ్య, మంచంమీదపడి ఉమ వెక్కి వెక్కి ఏడవటం కన్పించేసరికి కంగారు పడింది.

"ఏం ఉమా! ఎందుకేడుస్తున్నావు?" అంటూ ఏడుస్తున్న ఉమని కదుపుతూ అడిగింది సంధ్య

"అక్కా!" అంటూ బావురుమంది ఉమ.

"ఎందుకు ఉమా? ఏం జరిగింది? నాతో చెప్పవూ! ఎవరేమన్నారు నిన్ను?"

జరిగింది అర్థమయ్యీ—చెల్లెలినుండి వివరంగా తెల్సుకోవాలని...తనకేం తెలియనట్టే అడిగింది సంధ్య.

"మరేం, బావలేదూ ... బావ తనని పెళ్ళి చేసుకోమని నన్ను ఒకటే బలవంతం చేస్తున్నా డక్కా" అంటూ అక్క ఒళ్ళో తలపెట్టి ఏడుస్తూ చెప్పింది ఉమ.

"అయితే అందుకెవరైనా ఏడుస్తారా!"

---

ఓ సభలో సభాకార్యకర్త ఛీఫ్‌గెస్టుగా వచ్చిన మాజీ మంత్రిగార్ని పరిచయంచేస్తూ,

"వీరి గురించి నేను ఏమాత్రం చెప్పనక్కర్లేదు. దేశభక్తులు. చాలా మెత్తటి స్వభావులు, సహృదయులు, చూపులకు కఠినంగా కన్పడినా లోని హృదయం చాలా మెత్తనిది. ఎలాగంటే కొబ్బరికాయను చూడండి! ఎంతగరుకుగా గట్టిగా వుంటుందో లోపల అంతటి మెత్తటి తియ్యటి కొబ్బరి వుంటుందో... అట్లాగే వీరును—"

ఇంతలో సభలో ఓప్రక్కనుంచి

"కొన్నిలోపల కుళ్ళికూడ వుంటాయి" అని వినపడింది.

---

"లేదక్కా- నేను బావని చేసుకోను. నాకు తనంటే అలాంటి ఉదేశమెప్పుడూ లేదు. అలా అని బావకి ఎన్నోసార్లు చెప్పేను. అయినా వినడు- నీకీ విషయం ఎన్నోసార్లు చెబ్దామనుకునికూడా... ఎందుకులే రాద్ధాంతం చెయ్యటం. తనే అర్థం చేసుకుంటాడనుకుని. నీకెలా చెప్పాలో తెలియక ఊరుకున్నాను. కానీ ... కానీ ... తన వరస చూస్తుంటే- అత్తయ్యా వాళ్ళతోచెప్పి బలవంతంగానైనా నన్ను పెళ్ళి చేసుకునేట్టున్నాడు. మనమీ ఇంట్లోంచి ఎక్కడికైనా వెళ్ళిపోదామక్కా- వీళ్ళ ఎంచన దిక్కులేక వుంటున్నామనికదా, బావకి ఇంత అలుసుగా తయారయ్యేను" అంటూ వెక్కి వెక్కిపడుతూ చెప్తున్న ఉమ మాటలకి అడ్డు తగిలింది సంధ్య.

"ఛ. అవేంమాటలు ఉమా! అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నావు- ఎక్కడికి పోతాం మనం? అయినా నీ కెందుకని బావంటే ఇష్టం లేదు ఉమా! బావకేం తక్కువ!

బావకేం తక్కువ కాదుగానీ బావంటే నాకు ఇష్టమే తక్కువ. ఇష్టంలేని పెళ్ళి నేను చేసుకో లేనక్కా-నువ్వుకూడా బావతరపునే మాట్లాడావంటే నేను... ఏ నుయ్యోగొయ్యో చూసుకుంటానంతే- ఒక్కొక్క నిముషానికీ బావ నన్నొచ్చి వేధిస్తోంటే... నేనీ ఇంట్లో ఇంక ఉండలేను..." అంటూ శంకర్‌కీ, తనకీ మధ్య జరిగిన విశేషాలన్నీ ఒక్కొక్కటీ ఉమ చెప్తుంటే సంధ్య తెల్లబోయింది.

ఆశ్చర్యాన్నుండి తేరుకున్న సంధ్య "ఛ... ఇంక ఏడవక ఉమా-బావతో నీ పెళ్ళి జరగదు. సరేనా? - ఇంతేగా నీక్కావాల్సింది ఊ...లే... లేచి మొహం కడుక్కో...అత్తయ్యావాళ్ళువచ్చే టైమయింది" అంటూ చెల్లెల్ని లేవనంపి ... 'అయితే ఉమకి శంకరం బావంటే నిజంగానే యిష్టంలేదా! - అయితే ... అటువంటప్పుడు నా కోరిక...అమ్మా, అత్తయ్యల కోరిక తీరుతుందా?' అనుకుంటుంటే గతం కళ్ళ ముందు మెదలి సాగింది.

* * *

"ఏమండీ, మరి ఎప్పుడు ప్రయాణమవుదాం?" అంటూ అప్పుడే ఇంటికి వచ్చిన భర్తని అడిగింది జానకమ్మ.

'ఎక్కడికే ప్రయాణ మవ్వడం?' పడకకుర్చీలో కూచుంటూ అడిగేరు రామనాథంగారు.

'ఎక్కడికేంటి నాన్నా - సీతక్కయ్య పెళ్ళికి' అంది అప్పుడే అక్కడికి వచ్చిన ఉమ.

'ఓహోహో-ఇదంతా పెళ్ళి సన్నాహమన్నమాట అయితే, వెళ్ళక తప్పదంటావ్?'

'బాగానే ఉంది సంబడం' - మూతి విరిచింది జానకమ్మ.

అవతల మా అక్కయ్య తన ఒక్కగానొక్క కూతురి పెళ్ళి తలపెడ్తే,— ఇంకా నెల రోజులు ముందువెళ్ళి అక్కయ్యకి సహాయంగా ఉండమని పంపేసిపోయి పెళ్ళింకా నాలుగు రోజులుందనగా 'ఇంకా-వెళ్ళాలా' అని తీరిగ్గా అడుగుతున్నారా?'

'పోనీ-నెల రోజులముందు వాళ్ళకే తెలియదు ఈ సంగతి. కబురు చెప్తున్నావు మరీనీ' అంటున్న తండ్రి మాటలనందుకుంది ఉమ.

'ఈ అమ్మ ఎప్పుడూ యింతే నాన్నా-నాకూ, అక్కకీ పరీక్షలుకదా...యిప్పుడు మీరెళ్తే ఎలాగేంటి?'

'అవున్లు నీకూ, సంధ్యకూ పరీక్షలుకదూ!... అయితే పెళ్ళికి మీరెళ్ళరన్నమాట మీ అమ్మతో-'

'మీరెళ్ళరా అని వాళ్ళనడుగుతారేంటి - మీరు రాకేమిటి? చెట్టించి అడిగింది జానకమ్మ.

'మరి ఇద్దరింపెడ్తే పిల్లలో...'

'పిల్లలా.. ఇంట్లో వుంటారు. వారం రోజులు ఆ మాత్రం గడుపుకోలేరేంటి? వంటావిడ ఎలాగూ వుంటుందయ్యె వీరాజుని ఆ నాల్రోజులూ ఇంటి ముందు పడుకోమంటే సరి' అంటూ విడమర్చింది జానకమ్మ.

'రాత్రిళ్ళు పనివాడు పడుకుంటాడు - వంటావిడ వండిపెడ్తుంది. మరి పిల్లు పరీక్ష వ్రాయడానికి వెళ్తేనో...'

'అబ్బబ్బ - ఏమిటండీ మీ ధర్మసందేహాలూ

మీరూనూ - ఇల్లు తాళం వేసుకు వెళ్ళారు - ఒక్క వారం రోజులకి ఏమిటంత గొడవనేసిపోతున్నారు. ఏం సంధ్యా, ఉండలేరూ ?'

'మేం ఉంటాంలే అమ్మా-మీ వెళ్ళిరండి' అంది సంధ్య.

ఎలాగయితేనేం పెళ్ళికి తరలి వెళ్ళేరు. రామనాథం దంపతులు ... అంతే-ఆ వెళ్ళడం వెళ్ళడం వాళ్ళు మళ్ళీ తిరిగి రాలేరు. పెళ్ళిచూసి వస్తుండగా తిరుగు ప్రయాణంలో వాళ్ళెక్కిన రైలు వాళ్ళనింటికి చేర్చలేకపోయింది. సజీవంగా కళ కళలాడుతూ బయలుదేరిన వాళ్ళని, నిర్జీవంగా ఇంటికి చేర్చడం జరిగింది.

ఉమా, సంధ్యలకి దారుణం అశనిపాతమే అయింది. బంధువులంతా రావడం, పరామర్శలూ, ఏడుపులూ, మొత్తుకోళ్ళూ...జరగవలసిన విధులూ, తతంగాలూ ... అన్నీ అయ్యేక ... తమ్ముడికి, మరదలికీ గుర్తుగా మిగిలిన ఆ ఆడ పిల్లల నిద్దరినీ వెంటబెట్టుకుని మద్రాసు చేరింది వాళ్ళ మేనత్త, శంకర్ వాళ్ళ అమ్మ అయిన సుశీలమ్మ.

రోజులు గడిచిపోసాగేయి. తల్లీతండ్రీ తమని విడిచిపోయేరన్న సహజమైన దుఃఖం, బాధ తప్ప వేరే ఎటువంటి లోటూ లేకుండా మేనత్త, మావయ్యల దగ్గర వుంటున్నారు ఉమా, సంధ్య లిద్దరూ.

ఏమండీ - సంధ్యని మన కోడలిగా చేసుకుంటే ఎలా వుంటుంది ?'


పిచ్చిమొహమా ! దాని కాలోచనెందుకు ? ఈ సంవత్సరంలో నీ కొడుకు పెట్టిన గడువు పూర్తయిపోతుందిగా. ఇదరినీ అడిగి పెళ్ళి చేసేస్తే ...ఇంక ఉమకి సంబంధాలు చూడొచ్చు"

మేనత్త ఇంటికి చేరిన కొన్నాళ్ళకి, ప్రక్క గదిలోనుండి వినబడిన అత్తమామల సంభాషణకి ఉలిక్కిపడింది సంధ్య. ఉమకూడా విన్నదేమో ననుకుని ప్రక్కకి తిరిగి చూసింది. పుస్తకం గుండెలమీద పెట్టుకుని హాయిగా నిద్రపోతోంది ఉమ - సంధ్య లేచి ఉమ గుండెలమీది పుస్తకం తీసి టేబిల్ లైటు ఆర్పి మంచం చేరింది. అత్తయ్య మాటలకి రూపం కల్పించుకుంటూ, అందమైన శంకర్ బావ ప్రక్కన తనని తాను ఊహించుకుంటూ నిద్ర పట్టకపోవడంతో అటూ ఇటూ పొర్లుతూ...మధుర భావాలతో తేలి, మురిసి, మైమరచి ఎప్పుడో తెలతెలవారుతుండగా ఓటమి నంగీకరిస్తూ నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది సంధ్య.

శంకర్ని తనకి కాబోయే భర్తగా ఊహించుకుంటూ కలలు కంటున్న సంధ్య హృదయం - శంకర్ ఉమ అంటే మక్కువ చూపిస్తున్నాడని చూచాయగా శంకర్ ప్రవర్తన బట్టి గ్రహించిననాడు కలుక్కుమంది. తన సర్వస్వంగా భావించుకున్న బావని తననుండి ఉమ వేరు చేస్తున్నట్లు బాధతో విలవిల్లాడింది. క్షణ కాలం ఉమ అంటే కోపం ఈర్ష్య జనించినా... చెలెలి మీది ప్రేమ సంస్కారం వాటిని కప్పిపుచ్చేయి. ఎవ్వరికీ ఏమీ అనలేక ఎవరితోనూ తన వేదనని చెప్పుకోలేని సంధ్య, "నేను దురదృష్టవంతురాలిని' అని తనకి తనే నచ్చజెప్పుకుని జీవితంతో రాజీ పడవల్సివచ్చింది.

అటువంటి సంధ్య నిర్లిప్తహృదయంలో... ఉమకి శంకరమంటే ఇష్టంలేదు అన్నవార్త అడుగంటిన ఆశల్ని మళ్ళీ చిగురించేటట్లు చేసింది.

ఆలోచనలనుండి తేరుకున్న సంధ్య - 'ఉమ బావని చేసుకోనన్నంత మాత్రాన బావ నన్ను




చేసుకుంటానని నమ్మకమేమిటి? ఉమమీద మనస్సు మరల్చుకుని నన్ను పెళ్ళి చేసుకోవానికిష్టపడ్తాడా ? బావ అభిప్రాయం తెల్సుకోవడం ఎలా ?' అనుకుంటూ దిగులు చెందింది.

* * *

'బావా...'

'ఎవరూ సుమా - సంధ్యా ?'

'నేనే బావా - నీతో కాస్త పనివుండి వచ్చేను'

'ఓహో సంధ్యా !'

'పరవాలేదు బావా...ఈ కథ చదివి నీ అభిప్రాయం చెప్తావా ?' కాగితం ముక్క గుర్తుగా పెట్టిన పుస్తకాన్ని శంకర్కి అందిస్తూ అడిగింది సంధ్య.

'ఇదేంటి సంధ్యా క్రొత్తగా...కథ మీద నా అభిప్రాయ మడుగుతున్నావే. కథ అంతబాగుందా? లేకపోతే ఇంట్లో ఏం తోచడం లేదా? - ఈ కథ సంగతేంగాని...ఏదో పనుందన్నావు ?' నవ్వుతూ అడిగేడు శంకర్.

'ఇదె... ఈ పనిమీదే వచ్చేను. ఈ కథమీద నీ అభిప్రాయం కావాలి నాకు. తొందరేం లేదులే. నీకెప్పుడు వీలయితే అప్పుడు చదివి - నీ అభిప్రాయం తెలియచేస్తావుగా' - అంటూనే గుండెలు గుబ గుబ లాడ్తోంటే శంకర్ గదినుండి బయట పడింది సంధ్య.

సంధ్య ప్రవర్తన శంకర్కి ఆశ్చర్యమన్పించింది. ఎందుకలా క్రొత్తగా, బెదురుతున్నట్లుగా మాట్లాడ్తోంది. ఈ కథేమిటి ? ఎందుకు చదవమనుంటుంది నన్ను ?' అనుకుంటూ సంధ్య గుర్తు పెట్టిన కథ తీసి చదవసాగేడు.

క్లుప్తంగా కథలోని సారాంశం యిదీ- శోభా, రేఖా అనే అక్కచెల్లెళ్ళకి గిరిధర్ అనే బావ వుంటాడు - పెద్దదయిన శోభ గిరిధర్ మీద ఎన్నో ఆశలు పెంచుకుంటుంది - కానీ గిరిధర్ ... తన చెల్లెల్ని ప్రేమిస్తున్నాడని తెలుసుకుని కృంగిపోతుంది. తన అభిప్రాయం రేఖకి తెలియజేసి, రేఖని పెళ్ళాడాలనుకున్న గిరిధర్ రేఖ తనకలాంటి అభిప్రాయం లేదంటూ తిరస్కరించడంతో సర్వమూ కోల్పోయిన వాడిలా నిద్రాహారాలుమాని మంచానపడితే శోభ బావకి సపర్యలుచేసి, అతనంటే తనకున్న మక్కువని తెలియజేసి, అతని హృదయాన్ని చూరగొంటుంది. రేఖని క్రమేపి మర్చిపోయిన గిరిధర్ శోభని పెళ్ళిచేసుకోవటంతో కథ ముగుస్తుంది.

కథ ముగించిన శంకర్ ఆశ్చర్యంలో మునిగిపోయేడు. "అంటే... అంటే... సంధ్య— ఈ కథలోలా-నన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటోందా? ఉమని నేను ఇష్టపడడం, ఉమ నన్ను చేసుకోననడం... ఇవన్నీ సంధ్యకి తెలిసిపోయేయా-" అని ఆలోచిస్తోంటే... అతని ఆలోచనలకి అంతరాయం కల్గిస్తూ—

"ఏదైనా పనిలో వున్నావా శంకర్" అంటూ గదిలో ప్రవేశించింది సుశీలమ్మ.

ఉలిక్కిపడ్డాడు శంకర్.

"ఏం లేదు-రామ్మా" అంటూ మంచంమీదనుండి లేచి కూర్చున్నాడు. ప్రత్యేకంగా ఏదైనా ముఖ్య

విషయం మాట్లాడాలంటేనే తల్లి అలా గదిలోకి వచ్చి తీరిగ్గా కూర్చుంటుందని శంకర్‌కి తెలుసు. విషయమేమిటన్నట్లు తల్లివైపు చూసేడు.

'పరేంలేదు. నువ్వు పెట్టిన గడువు పూర్తయిందిగా - పెళ్ళి చేసుకుంటానికిప్పుడైనా ఒప్పుకుంటావా ఇంకమరి ?' అంటూ సూటిగా అడిగింది సుశీలమ్మ కొడుకుని.

'ఉమ మనస్సు ఎప్పటికయినా మారకపోతుందా అని ఎప్పటికప్పుడు ఏదోచెప్పి పెళ్ళిని వాయిదా వేస్తున్న శంకర్‌కి ఉమ మనస్సింక మారదని తెలిసి-తల్లికేం చెప్పాలో తోచలేదు అయినా నవ్వుతూనే 'ఇప్పుడేం తొందరొచ్చిందమ్మా నా పెళ్ళికి-అవతలిద్దరు మేనకోడళ్ళని పెట్టుకుని'- అన్నాడు.

'అందుకే తొందర నాయనా-సంధ్యని నువ్వు చేసుకుంటే-ఉమని ఒక యింటిదాన్ని చేసేస్తే, మేమింక నిశ్చింతగా వుండవచ్చు. సంధ్యకూడా నువ్వంటే ఇష్టపడుతోంది. మీ నాన్నగారుకూడా సంధ్యని కోడలిగా చేసుకోవాలని మురిసిపోతున్నారు. ఇంకేం అడ్డుచెప్పకు బాబూ ... అయినా నీకు మాత్రం ఏళ్ళు తక్కువ వచ్చేయా ఏమిటీ మేమూ పెద్దవాళ్ళం అయిపోతున్నాం. ఏ క్షణాన గుటుక్కుమంటామో...' అంటూ కంట తడిపెడుతున్న తల్లికి ఏమని సమాధానం చెప్పాలో తోచక అయోమయావస్థలో పడ్డాడు శంకర్.

'ఏం ! ఏమంటావు బాబూ - మేం బ్రతికి ఉండగా నీకు పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేకపోతే చెప్పెయ్యి - నీపెళ్ళిమాట యింకెప్పుడూ ఎత్తను.

'ఛ ! అవేం మాటలమ్మా ... నీ యిష్ట ప్రకారమే కానియ్యి' అన్నాడు శంకర్. ఏదో ఒక నిశ్చయాని కొచ్చినవాడిలా !

* * *

'సంధ్యా'

మంచంమీద పడుకుని పైకప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచిస్తున్న సంధ్య ఉలిక్కిపడి లేచి, 'రా బావా రా' అంది.

'అమ్మ నీతో ఏమైనా చెప్పిందా సంధ్యా'

చెప్పినట్లుగా తల వూపింది సంధ్య.

'ఏం చెప్పింది ?'

'నీకు తెలియదా ?' అన్నట్లుగా తలెత్తిచూసింది సంధ్య.

'మన పెళ్ళి గురించేనా ?' రెట్టించి అడిగాడు శంకర్.

'.........'

'మాట్లాడవేం సంధ్యా ? అమ్మకి నా సమ్మతి తెలియజేసేనుగానీ...నీ కథమీద నా అభిప్రాయం ...నీ కింక తెలిసినట్టేగా - అది చెప్పడానికే వచ్చేను' అంటూ వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతున్న శంకర్‌కి అడ్డుగావస్తూ 'బావా నువ్వు ... నువ్వు మనస్ఫూర్తిగానే ఒప్పుకుంటున్నావా ఈ పెళ్ళికి...' సంతోషం పొంగిపొరలే ఎద నణచుకుంటూ అడిగింది సంధ్య.

'మనస్ఫూర్తిగానే ఒప్పుకుంటున్నాను సంధ్యా.'

* * *

పెళ్ళి పందిట్లో అటుయిటూ సందడి సందడిగా తిరుగుతున్న ఉమని చూస్తే... శంకర్‌కి అదోలా అన్పించింది. తనకోరిక తీరినందుకు సంధ్యకి, తనకి బెడద వదలినందుకు ఉమకీ చాలా సంతోషంగా వుంది.

సంధ్యా శంకర్‌ల పెళ్ళయిపోయేక, ఉమ ఇది వరకటివన్నీ మర్చిపోయి, బావతో మామూలుగానే ఉన్నా. శంకరే అలా వుండలేక పోయేడు - ప్రతి విషయంలోనూ ఉమని దూరం చేయసాగేడు.

'బావగారేదో చాలా సంతోషంగా ఉన్నట్లున్నారే' అప్పుడే ఆఫీసునుండి వచ్చిన శంకర్‌ని ఉమ పలకరించింది.

'సమాధానం చెప్పకుండా 'సంధ్యా - సంధ్యా'- అని అరుస్తూ బూటు విప్పుకుంటూ కూర్చున్నాడు శంకర్. ఇంతలో టిఫిన్ తెస్తున్న సంధ్యని చూసి 'పిక్చర్ కెళ్దామని ఫోన్ చేస్తే ఇంకా అలాగే వున్నావేం' అని అడిగేడు.

'ఎంతసేపూ ! ఇదిగో మీరీ టిఫిన్ తింటూ వుండండి అయిదు నిముషాల్లో వచ్చేస్తాం' అంది సంధ్య

'వచ్చేస్తాం-అంటున్నావు ఎంతమందిని మందేస్తున్నావేమిటి ?'

'ఎంతమందేమిటండీ ! నేనూ ఉమేగా...'

'ఛట్, మనిద్దరం వెళ్దామని చెప్తే మధ్యలో అదిదెందుకు కలుపుతున్నావుఅనవసరంగా,విసుగ్గా అన్నాడు.

'ష్-మెల్లగా-ఉమ యిక్కడే వుంది' అంటూ సైగ చేసింది సంధ్య.

'ఉంటే నాకేం-తనొస్తే నే రాను-హాయిగానీతో వెళ్ళాలనుకున్నానుగానీ. ఈ పటాలమంతా ఎందుకు?

'మతి లేకుండా ఏమిటా మాటలు ? దాన్ని ఒక్కర్తినీ వదిలేసి వెళ్తే అదేమనుకుంటుంది ?'

'ఏమనుకుంటుంది? అక్కా బావా సినిమా కెళ్ళేరనుకుంటుంది...ఊ ..ఊ...త్వరగా తెములు అంటూ తొందర చేసే మొగుణ్ణిచూసి ప్రేమించిన ఉమని ఇంత త్వరగా మర్చిపోయినందుకు సంతోషించాలో తన చెల్లెల్ని పూర్తిగా విస్మరిస్తున్నందుకు బాధపడాలో తెలియని అవస్థలో పడి, కాదనలేక, శంకర్ వెనకే బయల్దేరింది సంధ్య ఒంటరిగా.

తనని వదలి బావ వెంట అక్క అలా సినిమా కెళ్ళిపోయినందుకు మొదట కాస్త కష్టమనిపించినా బావ అంతగా మారినందుకు, తనని పట్టించుకోనంతగా బావలో మార్పువచ్చినందుకు చాలా సంతోషించింది ఉమ.

* * *

'సంధ్యా ... సంధ్యా ... ఆఫీసుకి టైమయిపోతోంది ...'

'ఇందాకట్నుంచీ చూస్తున్నాను. ఏమిటా అరుపులు. అవతల అత్తయ్యా వాళ్ళేమనుకుంటారు ? టైమయిందని అలా గావుకేకలు పెట్టేబదులు వెళ్ళకూడదా ?' చిరాకు నభినయించింది సంధ్య.

'నువ్వు వంటింట్లో వుంటే - నే ఆఫీసు కెట్లా వెళ్ళను ? ఊ ... ఊ ... త్వరగా ఇయ్యి. వెళ్ళిపోతాను ...'

'ఏమిటీ ఇచ్చేది ?'

'ఏమిటా ... ఇది' అంటూ సంధ్యని చేతుల్లోకి తీసుకున్నాడు.

'ష్... ... అబ్బా ... ఏమిటి బావా ఇది ! రోజు రోజుకీ మరీ తయారవుతున్నావు. అవతల వాళ్ళంతా ఏమనుకుం ...' సంధ్య మాటలను పూర్తి చెయ్యనివ్వని శంకర్, పెదాలు తుడుచుకుంటూ, హాల్లో కూర్చున్న ఉమని దాటుకుంటూ హడావిడిగా బైటికెళ్ళిపోయేడు.

'ఎంత మారిపోయాడు బావ ! అక్కనెంత ప్రేమగా చూసుకుంటున్నాడు' అనుకుంది. రోజూ ఈ తతంగాన్నంతా ఓ కంట కనిపెడ్తున్న ఉమ.

* * *

ఒక రోజు రాత్రి.

మంచినీళ్ళకోసం లేచేడు శంకర్ - ప్రక్క గదిలో లైటు వెలుగుతోంది. 'అంటే ఉమ ఇంకా నిద్రపోలేదన్నమాట' అనుకున్నాడు శంకర్.

మంచినీళ్ళు త్రాగేడు.

మంచం చేరేడు.

'సంధ్యా—సంధ్యా...' అంటూ సంధ్యని లేపేడు.

'ఊఁహొద్దుండేగాని ... లేవటంలేదు సంధ్య. ఇంక ఇలా కాదనుకుని కుదిపి కుదిపి లేపి కూర్చోబెట్టేడు.

'అబ్బ...నిద్రపోతోంటే ఏమిటి బాబూ ఈ గోల...' అంటూ ఆవలించసాగింది సంధ్య.

'దున్నపోతులా నువ్వు నిద్రపోతున్నావు. నాకు నిద్ర రావటంలేదు...ఏం చెయ్యాలేంటి ?'

'ఇది చెప్పడానికా లేపేవు ? నీకేమైనా పిచ్చి పట్టిందా ?... మాట్లాడకుండా పడుకో..." అటు వత్తిగిలుతూ అంది సంధ్య.

భుజంపట్టి తనవేపు తిప్పుకుంటూ ... అబ్బ ఎంతాశ. అలా పడుకోనిస్తావేంటి ?... నన్ను నిద్రపుచ్చి నువ్వు పడుకో... అన్నాడు శంకర్ మారాం చేస్తున్నట్లుగా.

"అర్ధరాత్రిలేచి కూర్చుని ఏమిటీగోల: అందరూ లేస్తారుకూడాను. నీ గొడవకి..."

"అందుకే ఎవ్వరూ లేవకుండా... నేను నిద్రపోయేక నువ్వు పడుకో..."

"నువ్వు నిద్రపోమరి... నేనేం చెయ్యాలేంటి నీకు నిద్ర రాకపోతే..."

"ఏం చెయ్యాలా..."

"అబ్బ. ఏమిటిబావా... ష్ అరె గాజులు..."

వినకూడదనుకున్నా ప్రక్కగదిలోనుండి వినబడుతున్న మాటలకి మొదట నిట్టూర్పులు విడిచినా, ఆ తర్వాతచిన్నగా నవ్వుకుని ... తన చదువులో మునిగిపోయింది ఉమ.

* * *

నేనో మంచివార్త చెప్తాను. నాకేమిస్తారు మరి" అంటూ అప్పుడే ఆఫీసునుండి వచ్చిన భర్త చేతిలోని పూలపొట్లం అందుకుంటూ అడిగింది సంధ్య.

'దేనిగారెప్పుడే మడిగితే ఏది కాదన్నానుగనుక! అయినా ఏమిటబ్బా అంత మంచి వార్త!' అంటూ ఆలోచించసాగేడు శంకర్.

'చాలా మంచి వార్తే...అరెరె...ఉమా నువెళ్లిపోతే ఎట్లానే ... పోకే...' సంధ్య వారిస్తున్నా

విశ్రాంతి తీసుకోకుండా పారిపోయింది ఉమ హాల్లోంచి.

'మన ఉమకి రేపు పెళ్ళిచూపులు తెలుసా?'

'ఉమకి పెళ్ళిచూపులా!' పైవిప్పుకుంటున్న వాడలా రక్కున ఆగిపోయేడు శంకర్.

"ఊ... మరేమనుకున్నారు - అబ్బాయి ఇక్కడే యూనివర్సిటీలో రీసెర్చ్ - మిర్యాలగూడెం రామారావు గారింటికి మావయ్య వెళ్ళేఅయిన చెప్పేరట. ఈ సంబంధం పెళ్ళికొడుకు ఇలు కూడా వాళ్ళ ప్రక్క సందులోనేనట మావయ్య వెళ్ళి మాట్లాడి. రేపు మంచిరంటే... ఇంక ఆలస్యమెందుకని రేపే వచ్చెయ్యమన్నారట.'

ఉత్సాహంగా చెప్పుకుపోతున్న సంధ్యకేసి అలానే చూస్తుండిపోయేడు శంకర్ విస్మయంగా.

* * *

ఉమకి పెళ్ళయిపోయింది. అంతవరకూ చెల్లెలి పెళ్ళిలో సందడిగా, సరదాగా తిరిగిన సంధ్యకి చెల్లెలు అత్తారింటి కెళ్ళిపోతుందనేసరికి ఎక్కడలేని ఏడుపూ ముంచుకొచ్చింది. ఉమ సంగతి చెప్పనే అక్కర్లేదు.

'ఎక్కడికి పోతుంది సంధ్యా? మన ఉమ ఊర్లోనే వుంటుందిగా... రోజూ వెళ్ళి చూసి రావచ్చు - ఛ - ఏడవక ఉమా!' అంటూ కూతుళ్ళ ఇద్దరినీ ఊరడించింది సుశీలమ్మ.

ఉమ వెళ్ళిపోవటంతో ఇల్లు చిన్నబోయినట్లని పించింది అందరికీ.

* * *

కాలం దాని మానాన అది పరుగిడుతూనేవుంది అప్పుడే ఉమ పెళ్ళయిపోయి సంవత్సరం దాటుతోంది.

* * *

'బావా! సినిమా కెళ్దామా?' అడిగింది సంధ్య.

'సినిమాలేదు. ఏంలేదు... నన్ను విసిగించకు' అంటూ విసుక్కున్నాడు శంకర్.

* * *

'పువ్వులు తెమ్మన్నానుగా ఏవీ'

'రోజూ నీకు పువ్వులు తేవడం తప్ప నాకు వేరే పనిలేదు కాబోల్ను.'

* * *

'ఏమండీ - శ్రీవారూ - ఈ రోజు మా రాణీ, కోటావాళ్ళు వస్తానన్నారు... మా అందరికీ కలిపి ఫొటోలు తియ్యరూ!'

'అద్దమైనవాళ్ళకీ ఫొటోలు తియ్యడమే నా పననుకున్నావా ఏమిటి!

'పోనీ... కెమేరా నాకియ్యి-మేం తీసుకుంటాం'

'అదేం కుదర్దు. కెమెరా ముట్టుకోవడానికీవీల్లేదు. నీ చేతుల్లో పడితే అది వున్నట్లే...'

'పోనీ — నువ్వే తియ్యొచ్చుకదేంటి...'

'ఎన్నిసార్లు చెప్పాలి? తియ్యనని...' గట్టిగా కసురుకుంటూ వెళ్ళిపోయేడు శంకర్.

* * *

రోజురోజుకీ శంకరెందుకిలా మారిపోతున్నాడో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు సంధ్యకి-తననెంతో అపురూపంగా చూసుకుని తను అడిగిందే తడవుగా అన్నీ చేసే శంకర్... ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం ... అను చెప్పినా చెయ్యకపోవడం, తను కలిసి నేనే మండిపడటం చేస్తున్నాడు.

ప్రేమకన్న లేనే... ప్రేమగానే పరకూ శంకర్ చేం చేనికోదానికి చిచాలు తింటున్న సంధ్యకి... ఎంతో ప్రేమగా చూసుకునే భర్త అలా ఎందుకు మారిపోయేడో అర్థంకాలేదు ఏదైనా చిరాకులోపడి గదితో అలా ప్రవర్తిస్తున్నాడేమో అనుకుందామను కుంటే... ఎన్ని రోజులిలా చిరాకు-రాకు. ఒకరోజు రెండు రోజులా ... కొన్ని నెలలుగా అంటిపడి తను చూస్తోంది మృదువుగా, మృదువుగా మాటాడుకుని ఎంత కాలమయింది? ఇలాంటి ఆలోచనలతో శంకర్ ప్రవర్తనలో వికృతి చెందింది సంధ్య.

* * *

'రోజురోజుకీ మరీలా తయారౌతున్నావేమక్కా ఇటికి వచ్చిన సంధ్యని అడిగింది ఉమ.

'ఎలా తయారౌతున్నానే ... గుమ్మటంలా వుంటేనూ...'

'అలా అని నువ్వనగానే సరిపోయిందేంటి?

---

ముక్కోపి, ఛందశాసనుడిగా పేరు పొందిన ఈమధ్యనే రిటైరు అయిన ఓ ప్రిన్సిపాలు యింటిముందునుంచి యిద్దరు గొట్టాం ప్యాంటు వెళ్తా.

"చూడరా ఈ రాక్షసుడు యింతటి లంద మైన గులాబీలను పెంచుతాడని ఎవరైన అనుకుంటారా?" అన్నాడు ఓ గొట్టాం ప్యాంటు అందమైన గులాబీలతో నిండి వున్న తోట చూస్తూ.

"పోరా .... ఆ అందమైన పూలకోసం కాదురా సన్నాసి ... ఆ రాబుపేలిన ముళ్ళ కోసమేనోయ్ వాటిని పెంచేది."

---

మొక్కొచ్చినపుడు శిల్పంలా తయారౌతున్నావని అత్తయ్యకూడా అని గోల పెట్టింది. నువ్వేదో దాస్తున్నావు. కొంపతీసి ..ఏమైనా ...విశేషం లాంటిది కాదుకదా...'

'విశేషమూ పాడా... నా బ్రతుకే పెద్ద విశేషమై పోయింది. ఇంక అవొక్కటే తక్కువ.

'ఏం-ఏమైందక్కా... నువ్వీ ఏదో దాస్తున్నావు నా దగర - విన్నీరోజుంక వవిలేదిలేదు. నువ్వెందుకిలా వుంటున్నావో చెప్తేగాని వీలేదు.' మంకుపట్టు పట్టింది ఉమ.

'ఏం చెప్పమన్నావే - ఏం లేదంటోంటే ... అంటున్న సంధ్య కళ్ళనిండా నీళ్ల నిండుకున్నాయి రెప్పలార్చితే జలజలమని రాలేటట్లున్నాయి.

'అక్కా... ఏడుస్తున్నావా? ఎందుకక్కా... నాతో చెప్పకపోతే ఒట్టే'

ఎంతో కాలంగా బాధనంతా తనలోనే అణచు కున్న సంధ్య యిక ఆగలేకపోయింది. దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది. తన బాధనంతా వెక్కిళ్ళ మధ్యనే చెల్లెలితో చెప్పుకుంది.

బావ అక్కని సరిగ్గా చూడటం లేదని విన్న ఉమ మొదట ఆ మాటను విశ్వసించలేకపోయింది. అయినా అటువంటి సమయంలో చెప్పాలో చెప్ప కూడదో తెలియక... చెప్పినందువల్ల అక్క నేమయినా మంచే జరుగుతుందేమో ననిపించి... అప్పుని కొన్ని విషయాలు చెప్పి ... నేనిలా బావ గురించి చెప్పినందుకు ఏమీ అనుకోకక్కా.... నే నెప్పటికప్పుడు నీకీ విషయాలు చెప్పాలనుకుని కూడా - చెప్పలేకపోయేను. అయినా నిన్ను బావ సరిగా చూడటం లేదనీ, అందుకే నువ్విలా ఎండి పోతున్నావన్న ఊహే నాకేమాత్రం రాలేదు. బావ నిన్నెంత అపురూపంగా చూసేవాడో నాకు తెలియ నిది కాదు. అలాంటి వాడు - మారిపోయేడంటే - ఇందుకు కారణం - పోనీ - నేనే అయివుంటే - బావ - నీ కొంగు పట్టుకొని అన్నాళ్ళు తిరిగిన బావ మధ్యలో ఎందుకు మారాడు? ఏది ఏమయినా నేను చెప్పిన వేవీ మనసులో పెట్టుకోకక్కా....' అంది.

'లేదు ఉమా, బావ నన్ను నిర్లక్ష్యం చెయ్యడా నికి కారణం నువ్వుకాదు. ఒకప్పుడు బావ నిన్ను ప్రేమించిన మాట నిజమే - అయినా ఆ తర్వాత అనెలా మారిపోయేరో నీకూ తెలుసు. అన కింకేం చికాకు లున్నాయో ... నెమ్మది మీద అనే చెప్తా రేమోలే ... నా సంగతికేంగానీ...నువ్వు ఇవేం మనస్సులో పెట్టుకుని మదనపడక ...' అంటూ చెల్లెలు చెప్పిన విషయాలు తనని కలవరపర్చినా... కలవరాన్ని కప్పిపుచ్చుకుంటూ అంది సంధ్య.

* * * *

ఉమా,

నిన్ను ఏమని సబోధించాలో తెలియడం లేదు. ఏమని పిలవడానికి నా మనస్సంగీకరించడం లేదు. మన పెళ్ళయి రెండేళ్లు దాటింది. ఈ రెండు సంవత్సరాలలో నా మనసు మిగుల్చుకున్న దేమిటనుకుంటే .. బాధ - అంతులేని వ్యథ - ఇలా ఇంకెంతకాలం గడపవలసి వచ్చేదో - కానీ ఆ అవసరం ఇప్పుడింక లేదు.

మా అమ్మావాళ్ళూ ఒకటి రెండుసార్లనుకుం టొంటే విన్నాను 'సంధ్యని శంకరం కిచ్చి చేస్తే బాగుంటుం' దని. ఆ మాటలు విన్ననాటి నుండి నువ్వు నా మనస్సులో దోబూచులాడడం మొదలు పెట్టేవు ఏవేవో పిచ్చి పిచ్చి కలలు కనేదాన్ని - అలాంటి నా కలలకి, ఆలోచనలకి ఒక రూపాన్ని ఏర్పరిచేయ-నేను ఇక్కడికి వచ్చిన కొంతకాలానికి అత్తయ్యా మావయ్యాతో చెప్పిన-నేను యథాలాపంగా అన్న మాటలు. వాళ్ళు నన్ను తమకోడలిగా చేసు కోవాలనుకుంటున్నారని తెల్సిన నాటినుండీ నా ఆశలు నీ చుట్టూ అల్లుకోసాగాయి. నాకు తెలీకుండానే నువ్వంటే ఎంతో మమకారాన్ని పెంచుకోవటం జరిగింది. కానీ నువ్వు ఉమ అంటే యిష్టపడ్తున్నావని తెల్సిననాడు - ఉమ అదృష్టానికి సంతోషించేను. నా దురదృష్టానికి నే వగచేను. అంతకు తప్ప అప్పట్లో నేవిం కేమీ చేయలేక పోయేను. కానీ వాడిపోయిన నా ఆశాలత తిరిగి చిగురించే అవకాశం ఉందనుకోలేదు. నా వాడివి కావనుకున్న నువ్వు నా వాడివైనందుకు ఎంతగానో మురిసిపోయేను. నా కలలు నిజమైనందుకు

ఉప్పొంగిపోయేను. పెళ్ళయిన క్రొత్తలో నాఅంతటి అదృష్టవంతురాలు లేనే లేదనుకున్నాను. కానీ- నా అంతటి దురదృష్టవంతురాలు వేరెవ్వరూ ఉండరని తెల్సుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఆ తర్వాత తర్వాత.

ఉమని ఇష్టపడ్డ నువ్వు నన్ను పెళ్ళిచేసుకున్నావంటే. అది నువ్వు మనస్ఫూర్తిగా చేసినపనే అనుకున్నాను. మొదట్లో నిర్మలంగా చూసుకున్న నీలో అంత హఠాత్తుగా వచ్చినమార్పుకి కారణం ఎంత వెదికినా దొరకలేదు. నా ఫ్రెండ్ శోభ అనేది- "పెళ్ళయిన కొత్తలోవున్న మోజు పోను పోనూ వుండదే. ఎంత ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్ళయినా రాను రానూ మెకానికల్‌గా తయారవుతుంది జీవితం" అంటూ- నేను "అదేంకాదు ఎప్పటికీ ఒకేలా ప్రేమని నిలుపుకోవడం మన చేతుల్లో ఉన్నపనే? కావాలంటే నా జీవితమే ఉదాహరణగా తీసుకో- రేపాటు మేమెలా ఉన్నామో- నేను చచ్చిపోయేవరకూ అలాగేవుంటాం. పదిమంది కాదుకదా పాతికమంది పిల్లలుపుట్టినా అన్యోన్యంగా వుండేవాళ్ళని కాలం ఏంచెయ్యలేదు' అంటూసవాలు చేసేదాన్ని - పెళ్ళయిన సంవత్సరానికే నువ్వు మారిపోతే - నాలో ఏమైనా లోపాలున్నాయేమో. నేనేమైనా తప్పు చేసేనేమోనని తరచి తరచి నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఏదో చిరాకుతో నాతో సరిగ్గా ఉండలేవేమో ననుకుని ఏ రోజు కారోజు నాకు నేనే సర్దిచెప్పుకుంటూ వచ్చాను. కానీ నా తప్పేం లేకపోయినా - రోజురోజుకీ నన్ను చిత్రవధ చేసి తృంగదీశవే గానీ కారణం నువ్వు చెప్పలేదు. నేను తెల్సుకోగలగడంగానీ జరగలేదు.

ఆమధ్య ఉమా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు తను చెప్పిన విషయాలు కొన్ని అసలే విశ్రాంతిలేకుండా అలసటతో అలమటిస్తున్న నా మెదడుకి మనస్సుకి మరింత అశాంతిని చేకూర్చాయి. అసలు ఉమ చెప్పిన మాటలు నమ్మాలో. నమ్మకూడదో కూడా నాకు తెలియలేదంటే కారణం. నీమీదనాకున్న అచంచల విశ్వాసమే. ఎందుకంటే మొట్ట మొదట్లో నువ్వుచూపిన ప్రేమాభిమానాలూనూ - కనీ ఆలోచించి చూస్తే, ఉమకి - నా చెల్లెలికి - నీమీద అబద్ధాలు చెప్పవలసిన అగత్యం ఏముందనుకుంటే — ఏమీ కనబడలేదు. మన పెళ్ళికాక మునుపు నువ్వు ఉమచుట్టూ ఎంతగా వెంటపడి ప్రాకులాడేవాడివో నాకు తెలియనిది కాదు. పెళ్ళయ్యాక నీలో ఉమ అంటే వచ్చిన మార్పు తనని చూస్తే కలిగే చిరాకు చూసి నాకు ఆశ్చర్యమేసినా, ఆనందించేను అందరి ఆడవాళ్ళలాగే నా భర్త హృదయంలో నా కొక్కదానికే - నాకు మటుకే - స్థానముందా అనుకున్నాను. ఉమని నువ్వు మర్చిపోవటం, నన్ను అంతకు వెయ్యి రెట్లు ప్రేమించడం కేవలం నా అదృష్టమనే అనుకున్నాను. కానీ ..కానీ...నాదంతా భ్రమ అనీ నువ్వు చేసినదంతా నటనని తెలిసిపోయింది ఉమ చెప్పిన మాటలు నాలో అలజడిని రేపేయి నీలో వచ్చిన మార్పుకి-ఉమ చెప్పిన దెంతవరకూ కారణమో తెల్సుకోవాలనిపించింది...అది తేలేదినా బాధకి ఉపశమనం కలిగేది. ఇంక ఒక్కదారి వల్లే - అందుకే అశాంతితో అలమటిస్తున్న నేను సత్యాన్ని తెల్సుకోడానికి - నీ డైరీ తీసేను చదివితే అయినా నీ డైరీలు చదవాలన్న కుతూహలం నాకేనాడూ కల్గలేదు. అలాంటిదేదైనా వుంటే మొదట్లోనే నిన్నడిగి తీసుకునే చదివేదాన్ని. కానీ నాకలాంటి తలపులే రాలేదెన్నడూ - నువ్వు రెగ్యులర్‌గా డైరీ వ్రాస్తావని తెలిసినా, ఆ ఆసక్తి నాలో ఏనాడూ కల్గలేదు నాలో ఆసక్తిని - నీ చేతలు, ఉమ మాటలు కలిగించేయి. అది ఆసక్తి కూడా కాదు. నీలోని మార్పుకి కారణం తెలియకుండా సతమత మౌతున్న నేను - ఇంక మనశ్శాంతితో బ్రతకాలంటే వేరే మార్గం కన్పించలేదు.

* * *

"నేను కోరుకున్న ఉమ నన్ను కాదంది. తను బతికుండగా నన్ను పెళ్ళి చేసుకోనని కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. రామాయణంలో పిడకల వేటలామధ్యలో సంధ్యఒకర్తి తయారయింది. తన కోరిక వెలిబుచ్చి నా అభిప్రాయం అడిగింది. అమ్మావాళ్ళ అభీష్టం కూడా నేను సంధ్యని చేసుకోవాలనే - అవును! సంధ్యని చేసుకుంటాను. ఉమని సాధిస్తాను. నేనూ సంధ్యా కలిసిమెలిసి తిరుగుతుంటే ఉమ ఉడుక్కోవాలి - అసూయ చెందాలి. నా విలువ తనకి తెలిసిరావాలి తన పంతంకావరం అణచాలి ... ఇక ఈరోజునుంచి నేను నాటకం ఆడాలన్నమాట — బ్రతుకే ఒక నాటకం. అందులో ఇది అంతర్నాటకం - ఇది ఎన్నాళ్ళో...ఎలా ముగుస్తుందో!"

'ఉమ ఎదురుగా నేనూ సంధ్యా సినిమాకెళ్ళాం.'

'ఉమ చూస్తుండగా సంధ్య తలలో పువ్వులు పెట్టేను.

'ఉమ గదిలో ఉండటం తెలియనట్లుగా నటించి సంధ్యని ఎదురుగా ముద్దుపెట్టుకున్నాను.'

"సంధ్య ఉమను పిలుస్తున్నా నేను వద్దని వారించి, సంధ్యా నేనూ వాకింగ్‌కెళ్ళాం. ఉమ మొహం చూడాలి, సంధ్య పిలిచినప్పుడు నేను వద్దన్నప్పుడు. 'ఉమ వద్దంటూంటే నువ్వు నమ్మంటావెందుకన్నా-పానకంలో పుడకలా మీ మధ్య నేనెందుకు?' అని మొహం మాడ్చుకుంది పాపం! ఉమ అలా ఉడుక్కుంటుంటే నాకెంతో సంతోషమన్పించింది. ఇంకా ఇంకా ఉమని ఏడ్పించాలి-దీనికి సంధ్యనే సాధనంగా ఉపయోగించాలి."

"ఉమకి పెళ్ళట-ఛ!...ఉమ వెళ్ళిపోతే ఎలా? నా పగ ఎలా తీరుతుంది?"

"ఉమ అత్తారింటికెళ్ళిపోయింది. సంధ్యతో ఇక నటించాల్సినపనిలేదు.సంధ్య అంటే అసలు ఇష్టంగా కూడా ఇప్పుడనిపించటంలేదు. పెళ్ళి చేసుకున్నంత మాత్రాన ప్రేమించి తీరాలని ఎక్కడుంది? అయినా - సంధ్యలో గొడవేంలేదు. నేనెంత చేస్తే అంత తనకి' ఉమ సంగతే ఆలోచించాలి పోనీ ...ఇకనుండయినా రోజూ ఉమ యింటికెళ్ళి. ఇదివరకటిలా ఉమతోఉండి. ఉమ భర్తకి ఉమ మీద అనుమానం కలిగేలా చేస్తే ..'

* * *

పైవవి ...నేను ప్రేమించి ఆరాధించి-ఎంతో పవిత్రంగా భావించుకున్న-నీ డైరీలోని వాక్యాలని నేరే చెప్పనక్కర్లేదుకదూ! నీ ఊహలింత వక్రంగా వుంటాయనీ, నీలో ఇంత నీచత్వం దాగివుందనీ నేను కలలో కూడా అనుకోలేకపోయేను. మన పెళ్ళయ్యేటప్పటికి-ఉమ అంటే చిరాకు పడే నువ్వు - ఉమ పెళ్ళయి అత్తగారింటికెళ్ళగానే...వాళ్ళింటికి రాకపోకలు సాగించేసరికి - అది మారినందుకు నేనూ ఉమా ఎంతో సంతోషించేం. కానీ దాని వెనకాల ఇంత కథ దాగివుందని తెల్సుకోలేకపోయేను. అసలు ఉమ అత్తవారింటికి వెళ్ళిన తర్వాత నుండే నువ్వు మారిపోయేవని నేననుకోలేక పోయేను. ఆ సంగతి గుర్తించలేకపోయేను. అత్తవారింటి కెళ్ళడానికీ నీలో మార్పు రావడానికి సంబంధం వున్నదన్న ఊహకూడా నాకు ఎప్పుడూ రాలేదు.

పాపం! నువ్వనుకున్న దానిలో జరగనిది నీ ప్లాన్ ప్రకారం నెరవేరనిదీ నువ్వెంత ప్రయత్నించినా ఉమ నీ వలలో పడకపోవడం దాని భర్త భాస్కరం విన్ననుమానించక పోవడం నువ్వు ఉమకి పువ్వులు తీసుకుపోయినా. నువ్వు తీసుకెళ్ళినా వాళ్ళతో కలిసి సినిమాలకి షికార్లకీ తిరిగినా - భాస్కరం నిన్ను అనుమానించక పోవడానికికారణం-అతని సహృదయత మాత్రమే నావా పరనక్క చనువనుకున్నాడే గనీ ఇంకేం స్ఫురించలేదు అతని మంచి మనస్సుకి ఉమ కూడా అలాగే అనుకుని నీతోమెలిగేది కానీ నువ్వు దాన్ని అలుసుగా తీసుకోవడం నీ పైత్యం వెర్రి తలలు వేయడం... ఉమతో నువ్వు ప్రవర్తించిన తీరు.. ఛి...ఉమ చెప్తే అదంతా నా చెవులతో ఎలా విన్నానో నాకేతెలియదు. ఆయన యింట్లో లేనప్పుడు దానితో అసభ్యంగామాట్లాడి హద్దుమీర బోవడం సినిమాలకి వాళ్ళతో వెళ్ళి దానికటు వాళ్ళాయన కూర్చుంటే ఇటు నువ్వుచేరి చేతులు దానిమీద వేసి దాన్ని ఇరకాటంలో పెట్టటం ఛీ... ఛీ...ఇంత నీచత్వం నీలో దాగివుందా? నువ్వు నేనే వెధవ వేషాలకి కాస్త గట్టిగా నిన్ను కసిరి అదుపులో పెట్టాలనుకుంటే అవతల ఆయన ఏంటారోమో నన్న భయంతో మెదలకుండా వుండేసరికి నీ వికారపు చేష్టలతో తను ఇరకాటంలో పడటం ... చివరి - ఆఖరికి ఆ మధ్య ఓ రోజున అతను ఇంట్లో లేని టైమ్ చూసి దాని చెయ్యి పట్టుకుని బలవంతం చేయబోవడం. అది చేసిన సత్కార్యం ... ఇవన్నీ ఉమ చెప్తోంటే- ఈ తల తీసికెళ్ళి ఎక్కడ పెట్టుకోవాలో తెలియలేదు. ఆ రోజునుండీ నువ్వు నీ డైరీలో రాసుకున్న మాటలు నన్ను మరింత బాధపెట్టి, ఆశ్చర్యపరిచి, నిన్నుమరింత అసహ్యించుకునేట్లుచేసేయి.

(ఇంకావుంది)